క్లుప్తంగా

సంతానలక్ష్మి అమ్మవారికి పూజలు



ప్రత్యేక అలంకరణలో సంతానలక్ష్మి అమ్మవారు

ఉదయగిరి: పట్టణంలోని సంతానలక్ష్మి ఆలయంలో శుక్రవారం జ్యేష్ఠమాసం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారికి అభిషేకాలు, అలంకరణ విశేష పూజలు నిర్వహించి భక్తులను దర్శనానికి అనుమతించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించారు.

వేడుకగా అచ్చమాంబ కల్యాణోత్సవం



మర్రిపాడు: మండలంలోని పొంగూరు మాలిచేలులో వెలసిన అచ్చమాంబ అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అచ్చమాంబ అమ్మవారు– వెంగమనాయుడు దంపతుల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కల్యాణోత్సవాన్ని వీక్షించారు. ఈ కల్యాణోత్సవానికి చుంచులూరు గ్రామానికి చెందిన తంగేడుపల్లి శ్రీనివాసులు – శ్రీకళ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలోని ఐటీఐ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ ట్రేడ్‌లలో రెండో విడత సీట్లను భర్తీ చేసేందుకు 10వ తరగతి ఉత్తీర్ణులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ షేక్ గౌస్‌బాషా శుక్రవారం తెలిపారు. అర్హులైన వారు ఈ నెల 24వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, 25వ తేదీన తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో రీ వెరిఫికేషన్ చేయించుకోవాలని తెలిపారు. 27వ తేదీన కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని తెలిపారు.

మధ్యాహ్న భోజనం నాణ్యత పరిశీలన



భోజనాన్ని రుచి చూస్తున్న ఏపీసీ ఉషారాణి

పొదలకూరు: పట్టణంలోని డీఎన్నార్ జెడ్పీ ఉన్నత పాఠశాలను సర్వశిక్ష అభియాన్ ఏపీసీ ఉషారాణి శుక్రవారం సందర్శించారు. మధ్యాహ్న భోజనం రుచి చూసి నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పిల్లలకు చిక్కీలు అందకపోవడంపై ఆరా తీశారు. చిక్కీలను ఇంకా సరఫరా చేయలేదని భోజన ఏజన్సీ నిర్వాహకులు వెల్లడించారు. ఏపీసీ వెంట హెచ్ఎం సునంద తదితరులు ఉన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు



వసతి గృహాన్ని సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జి వాణి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీ యామిని ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే వాణి ఆధ్వర్యంలో పొదలకూరు రోడ్డులోని విభిన్న ప్రతిభావంతుల బాలికల వసతి గృహంలో న్యాయ విజ్ఞాన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి వాణి మాట్లాడుతూ పిల్లల సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన 1098 సేవలు, బాలల చట్టాలపై అవగాహన కల్పించారు. బాలికలు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. తొలుత వసతి గృహంలోని వసతులు, భోజనం ఏర్పాట్లను పరిశీలించారు. ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని పిల్లలకు సూచించారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ వార్డెన్ కస్తూరి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ భేష్

- వింజమూరు జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రవేశాల జోరు
- ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న విద్యార్థులు



వింజమూరు జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ముఖద్వారం

వింజమూరు(ఉదయగిరి): గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సర్కారు బడులను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దింది. విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులను ప్రభుత్వం బడుల్లో ఏర్పాటు చేసింది. దీంతో విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా విద్యనభ్యసించి ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. వింజమూరులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు విభిన్న విభాగాల్లో రికార్డులు సృష్టిస్తున్నారు. ఏటా పదో తరగతి పరీక్షలతోపాటు జాతీయ ఉపకార వేతనాల పరీక్షల్లోనూ ఈ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరుస్తున్నారు. నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు గత రెండేళ్లలో 39 మంది విద్యార్థులు ఈ పాఠశాల నుంచి ఎంపికయ్యారని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

పదిలో ఉత్తమ ఫలితాలు

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో అధికశాతం మంది పేదవారే ఉంటారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ వారు చదువులో బాగా రాణిస్తూ కార్పొరేట్ స్కూళ్లలో చదివే విద్యార్థులకు దీటుగా ఫలితాలు సాధిస్తున్నారు. ఈ పాఠశాల విద్యార్థి కల్లం తులసీ శ్రీ రెడ్డి గతేడాది పదో తరగతి ఫలితాల్లో 588 మార్కులు సాధించి కావలి డివిజన్ స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచారు. ఈ ఏడాది వై.నిఖిల్ 580 మార్కులు సాధించి సత్తా చాటారు. 2023–24 విద్యా సంవత్సరంలో ఈ పాఠశాలలో 550 మార్కులు సాధించిన విద్యార్థులు 17 మంది, 500లకు పైగా మార్కులు సాధించి వారు 40 మంది ఉన్నారు. 2022–23లో 500లకు పైగా మార్కులు సాధించిన వారు 33 మంది ఉన్నారని ఆ పాఠశాల ఉపాధ్యాయులు చెబుతున్నారు.

విద్యార్థులకు సౌకర్యాలు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ బడుల్లో అనేక వసతులు సమకూరాయి. అన్ని సౌకర్యాలు ఉండడమే కాకుండా.. స్థానికంగా ఉన్న ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా సర్కారు బడులను తీర్చిదిద్దడంతో ప్రవేశాలు జోరుగా సాగుతున్నాయి. ఈ ఏడాది 200 మంది విద్యార్థులు కొత్తగా చేరారని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో 1000 మంది వరకు విద్యార్థులు ఉన్నట్లు తెలుస్తోంది. ఉపాధ్యాయులు కూడా నాణ్యమైన విద్యను అందిస్తుండడంతో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు.

వివిధ అంశాల్లో విద్యార్థుల సత్తా

- 2021–22లో ఈ పాఠశాల నుంచి 11 మంది విద్యార్థులు ట్రిబుల్ ఐటీకి ఎంపికయ్యారు. గతేడాది నలుగురు ఎంపికయ్యారు.
- ఈ ఏడాది ఎన్‌ఎంఎంఎస్‌కు 19 మంది విద్యార్థులు ఎంపియ్యారు. గతేడాది 20 మంది ఈ జాతీయ ఉపకార వేతనాలకు అర్హత సాధించారు.
- సీడ్స్ స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన పరీక్షల్లో ఐదుగురు విద్యార్థులు ఆరేళ్లపాటు రూ.3 లక్షల ఉపకార వేతనాల పొందేలా అర్హత సాధించారు.

ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం



మా పాఠశాలలో విద్యార్థులకు చదువుతోపాటు వివిధ పరీక్షల్లో ప్రతిభ కనబరిచేలా తర్ఫీదు ఇస్తున్నాం. ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. పది తరగతిలో మంచి మార్కులు సాధించేలా విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. చదువుతోపాటు క్రీడలు తదితర అంశాల్లో కూడా సత్తా చాటేలా ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తున్నారు.

– మాలకొండయ్య, హెచ్ఎం, జెడ్పీ హైస్కూల్, వింజమూరు



2023-24లో ఎన్ఎంఎంఎస్‌కు అర్హత సాధించిన విద్యార్థులు(ఫైల్)



నూతన ప్రవేశాలు తీసుకుంటున్న ఉపాధ్యాయులు

'నేను బడికి పోతా'పై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఉదయగిరి: మండలంలోని బిజ్జంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల పరిధిలో శుక్రవారం ఎంఈఓ–1 మస్తాన్‌వలి ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు 'నేను బడికి పోతా' కార్యక్రమంపై అవగాహన కల్పించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడి ఈడు పిల్లలను తల్లిదండ్రులు బడిలో చేర్పించాలని, ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా ఉన్నాయని తెలిపారు. అనంతరం కొత్తపల్లి గిరిజనకాలనీలో బడికి రాని విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంక్షేమ సహాయకుడు డి.ఏడుకొండలు, హెచ్ఎం నాయబ్‌బాషా, సీఆర్పీ సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



ఆత్మకూరు: పట్టణంలోని ఎల్‌ఐసీ కార్యాలయంలో జీవిత బీమా ఉద్యోగుల సంఘం ఆవిర్భావ వేడుకల్లో భాగంగా శుక్రవారం సంస్థ ఉద్యోగులు రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సంస్థ ఉద్యోగులతోపాటు ఎస్‌ఆర్‌జేడీ, ఎస్వీ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో శ్యామ్ ప్రసాద్, ఎస్.ప్రవీణ్, రమేష్, శీనయ్య, సాయితేజ, రమాదేవి, సీఐటీయూ నాయకులు జి.శివప్రసాద్, వాగాల శ్రీహరి, రెడ్‌క్రాస్ సంస్థ కార్యదర్శి సాధిక్ హుస్సేన్, సీపీఎం నాయకులు డేవిడ్‌రాజు, ఆత్మకూరు నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆదాయం రెట్టింపు చేయడమే లక్ష్యం



అల్లూరు: రైతులకు ఆదాయం రెట్టింపు చేయడమే లక్ష్యంగా అల్లూరు గ్రీన్‌ఫెడ్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ స్థాపించినట్లు ఆ సంస్థ డైరెక్టర్లు తెలిపారు. అల్లూరులోని కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో ఎఫ్‌పీఓ డైరెక్టర్ల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులే తాము తయారు చేసిన ఉత్పత్తులను దేశవ్యాప్తంగా విక్రయించుకునే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. అల్లూరు మండల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు ఎం.రాఘయ్య, అనిల్‌కుమార్, హరిప్రసాద్ రెడ్డి, శ్రీనివాసులు, శివశంకర్, వెంకటేశ్వర్లు, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుపై దృష్టి సారించాలి

వరికుంటపాడు: మండలంలో జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య పనులపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని కందుకూరు డీఎల్‌పీఓ కృష్ణమోహన్ పేర్కొన్నారు. ఆయన శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ పారిశుద్ధ్య కార్యక్రమాలు ఆగస్టు 30వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు బాధ్యతగా పాల్గొనాలని, పీఆర్ఐ1 యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. పంచాయతీల్లో ప్రతిరోజూ జరిగే ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలు, సమాచారాన్ని ఆ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బందితో కలిసి కుష్టువ్యాధి, డయేరియాపై అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ తోట వెంకటకృష్ణకుమారి, ఈఓపీఆర్డీ సికిందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కుక్కలకు రేబిస్ నివారణ టీకాలు

కలిగిరి: ప్రపంచ జూనోసిస్ డేను పురస్కరించుకుని శనివారం స్థానిక ప్రాంతీయ పశువైద్యశాలలో పెంపుడు కుక్కలకు రేబిస్ నివారణ టీకాలు ఉచితంగా వేయనున్నట్లు పశుసంవర్ధకశాఖ ఏడీఏ సురేష్‌బాబు శుక్రవారం తెలిపారు. కుక్కల యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అల్లూరులో..

అల్లూరు: ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా శనివారం స్థానిక ప్రాంతీయ పశువైద్యశాలలో పెంపుడు కుక్కలు, వీధి కుక్కలకు ఉచితంగా రేబిస్ టీకా వేయనున్నట్లు పశువైద్యాధికారి ఎ.మహేశ్వర రెడ్డి శుక్రవారం తెలిపారు.

చేజర్లలో..

చేజర్ల: ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా శనివారం చేజర్లలోని పశువైద్యశాలలో కుక్కలకు ఉచితంగా రేబిస్ నివారణ టీకాలు వేయనున్నట్లు మండల పశు వైద్యాధికారి పి.రాజేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పందులను తరలించకపోతే చర్యలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలోని పందులను దూరంగా తరలించాలని, లేకపోతే చర్యలు తప్పవని పందుల పెంపకందారులను కమిషనర్ రమణబాబు హెచ్చరించారు. నగర పంచాయతీ కార్యాలయంలో పందుల పెంపకందారులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. పట్టణంలో పందులు స్వైరవిహారం చేస్తున్నాయన్నారు. కళాశాలలు, పాఠశాలల్లోకి పందులు వెళ్తుండడంతో విద్యార్థులు భయపడుతున్నారన్నారు. వర్షాకాలంలో పందుల కారణంగా పారిశుద్ధ్యం లోపించి వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. రెండు వారాల్లోగా పందులను నగర పంచాయతీకి దూరంగా జనసంచారంలేని ప్రదేశాలను తరలించాలని సూచించారు.

కలెక్టర్‌ను కలిసిన కమిషనర్

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జిల్లా నూతన కలెక్టర్ ఆనంద్‌ను బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ కమిషనర్ రమణబాబు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి పూలమొక్క అందజేసి అభినందనలు తెలిపారు. నగర పంచాయతీ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ఆత్మకూరురూరల్: పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ప్రతిభ చూపిన శాలివాహన విద్యార్థులకు నెల్లూరు జిల్లా కుమ్మర శాలివాహన సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 13న ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కేఎస్ నరసయ్య, ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఆత్మకూరులో వారు విలేకరులతో మాట్లాడుతూ 2013లో జరిగిన పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో 75 శాతం, ఆపైన మార్కులు సాధించిన శాలివాహన విద్యార్థులు ఈ పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పదో తరగతిలో 450 మార్కుల పైన, ఇంటర్మీడియట్‌లో 750 కన్నా ఎక్కువ మార్కులు సాధించిన శాలివాహన విద్యార్థులకు నెల్లూరులోని కొత్తూరు అంబాపురంలో ఉన్న శాలివాహన కల్యాణ మండపంలో ప్రతిభా పురస్కారాలు అందజేస్తామని తెలిపారు. అర్హులైన విద్యార్థులు పదో తరగతి, ఇంటర్మీడియట్ మార్కుల జెరాక్స్ కాపీలతోపాటు తమ పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, వివరాలతో నెల్లూరు ట్రంక్ రోడ్డులోని ఆర్‌కే ప్రింట్ పాయింట్ వద్ద దరఖాస్తులను అందజేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా రాష్ట్ర కుమ్మర శాలివాహన సంఘం అధ్యక్షుడు ఐలాపురం వెంకయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కర్ శ్రీనివాస్, ముఖ్యఅతిథిగా గుంటూరు సీఐడీ విభాగం ఎస్పీ కేజీవీ సరిత, రాష్ట్ర సమాచార అధికారి ఐలాపురం రాజా పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు కేసీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణే ధ్యేయం



హ్యాండ్‌బుక్ ఆవిష్కరిస్తున్న అధికారులు



పాల్గొన్న అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు

ఆత్మకూరు: బాలికల సంరక్షణే ధ్యేయంగా వారికి అవసరమైన సంపూర్ణ ఆరోగ్య పరీక్షలపై అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా బాలల సంరక్షణాధికారి సురేష్‌కుమార్ అన్నారు. బాలికల సంరక్షణపై ఆత్మకూరులోని ఐసీడీఎస్ కార్యాలయంలో ఏఎన్‌ఎంలు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలకు శుక్రవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్‌కుమార్ మాట్లాడుతూ చిన్న వయసులోనే ఆడ పిల్లలకు వివాహం చేయడం నేరమన్నారు. ఇలాంటి ఘటనలు గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతుంటాయని, ఆశా కార్యకర్తలు వాటిని గుర్తించి వెంటనే అధికారులకు తెలియజేయాలని తెలిపారు. బాలికల విద్య కోసం కేంద్ర ప్రభుత్వం 'బేటీ బచావో.. బేటీ పడావో' కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని తెలిపారు. అనంతరం బాలికల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ముద్రించిన హ్యాండ్‌బుక్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆత్మకూరు సీడీపీఓ సునీలత, ఆత్మకూరు అర్బన్ కేంద్రం డాక్టర్ అస్మా, వైద్య సూపర్‌వైజర్ సుధాకర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నారాయణమ్మ, విజయలక్ష్మి, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లందరూ బడిలో ఉండాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఇందుకూరుపేట: బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని ఎంఈఓ–2 సునీల్‌కుమార్ తెలిపారు. నేడు బడికి పోతా కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ–2 సునీల్‌కుమార్ మాట్లాడుతూ విద్యతోనే ఉజ్వల భవిత ఉంటుందని, చిన్నారులను బడిలో చేర్పించి చదివించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి




తల్లులకు అవగాహన కల్పిస్తున్న రమణమ్మ

మనుబోలు: డయేరియాపై అప్రమత్తంగా ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ సూచించారు. మనుబోలులోని కోదండరామపురం అరుంధతీయవాడ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం మహిళలకు డయేరియాపై వైద్యాఆరోగ్య సిబ్బందితో కలిసి ఆమె అవగాహన కల్పించారు. కలుషిత నీరు, ఆహారం తీసుకోవడం వల్ల డయేరియా ప్రబలే అవకాశం ఉందన్నారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రతను పాటించడం ద్వారా డయేరియాను అరికట్టవచ్చని తెలిపారు. పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వర్షాకాలంలో వేడిగా ఉన్న ఆహారం, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను తీసుకోవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం రాజేశ్వరమ్మ, అంగన్‌వాడీలు మస్తానమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పులుల సంచారంతో హడలుతున్న ప్రజలు

- అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్న అటవీశాఖ అధికారులు



ఉదయగిరి అటవీ ప్రాంతం

ఉదయగిరి: వెలుగొండ అడవుల్లో భాగంగా ఉన్న ఉదయగిరి అటవీ ప్రాంతంలో రెండు పెద్ద పులులు, ఒక చిరుత పులి సంచరిస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు గురువారం ధృవీకరించిన నేపథ్యంలో ఉదయగిరి అటవీ సమీప గ్రామీణ ప్రాంత ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గత కొన్నేళ్లుగా ఈ ప్రాంతంలో చిరుతపులి సంచరిస్తున్నట్లుగా ఇంతకుముందు అటవీశాఖ అధికారులు నిర్ధారించారు. ఈ నేపథ్యంలో అడవి సమీపంలోని గ్రామాల పశువులు, జీవాల కాపరులు మేత కోసం అడవికి వెళ్లినప్పుడు జీవాలు మృత్యువాత పడిన ఘటనలు కూడా ఉన్నాయి. ఈ క్రమంలో ఈ అటవీ ప్రాంతంలో పెద్దపులులు సంచరిస్తున్నాయని గత కొన్ని నెలలుగా ఉదయగిరి, ఆత్మకూరు అటవీ రేంజ్ పరిధిలోని పలు గ్రామాల ప్రజలు చర్చించుకుంటున్నారు. మర్రిపాడు సమీపంలో కారును పెద్దపులి ఢీకొన్న ఘటనలతోపాటు ఉదయగిరి వ్యవసాయ కళాశాల సమీపంలో ఓ మేక పులి దాడికి మృత్యువాత పడిన ఘటనలు చోటుచేసుకున్నాయి. అయితే ఈ ప్రాంతాల్లో పులుల సంచారం లేదని అటవీ అధికారులు చెప్పినప్పటికీ ప్రజలు నమ్మలేదు. ఆ ఘటనలు చోటుచేసుకున్న కొద్దిరోజుల తర్వాతనే ఈ ప్రాంతాల్లో రెండు పెద్దపులుల తోపాటు ఒక చిరుతపులి సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు నిర్ధారించి సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించడంతో ఒక్కసారిగా కలకలం రేగింది. పైగా నీటివనరులు ఉండే అటవీ ప్రాంతానికి అడవి జంతువులు ఎక్కువగా వచ్చే అవకాశమున్నందున ఆ ప్రాంతానికి పులుల సంచారం కూడా ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. ఉదయగిరి కోనకాలువ నీళ్ల కోసం ఉదయగిరి పట్టణ ప్రజలు నిత్యం అటవీ ప్రాంతంలోకి వెళ్లడం జరుగుతోంది. పైగా తెల్లవారుజామునుంచే పట్టణ ప్రజలు నీటికోసం రాకపోకలు సాగిస్తుంటారు. పెద్దపులుల సంచారం ఉందన్న సమాచారంతో నీటికోసం వెళ్లే పట్టణ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఉదయగిరి పట్టణానికి అతి సమీపంగావున్న వ్యవసాయ కళాశాల సమీప అటవీ ప్రాంతంలో కూడా పులులు సంచరిస్తున్నాయన్న అనుమానాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. మొత్తమ్మీద పర్యావరణ సమతుల్యతకు పులుల సంచారం శుభసూచికమైనప్పటికీ వీటివల్ల ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకుంటాయోనన్న ఆందోళన అటవీ సమీప గ్రామాల ప్రజల్లో అధికంగా ఉంది. అయితే అటవీ శాఖ అధికారులు మాత్రం పులుల సంచారంతో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అవి దట్టమైన అటవీ ప్రాంతాల్లోనే సంచరిస్తాయి తప్ప గ్రామాలలోకి రావని చెబుతున్నారు.దట్టమైన అడవి ప్రాంతాలలో నీటికుంటలు ఏర్పాటుచేసినందున అక్కడికే నీటికోసం పులులు వస్తాయే తప్ప గ్రామాలవైపు రావని చెబుతున్నారు. పులుల సంచారానికి, వాటి మనుగడ కోసం అవసరమైన ఏర్పాట్లు చేసేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు అటవీశాఖ అధికారులు చెబుతున్నారు.